
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025



అట్టహాసంగా నేవీ విన్యాసాల ప్రదర్శన

- రిహార్సల్స్‌లో అపశ్రుతి...
- పట్టు తప్పి పడిపోయిన ఇద్దరు పారాట్రూపర్లు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో గురువారం సాయంత్రం తూర్పు నౌకాదళం సాహస విన్యాసాల ప్రదర్శన అట్టహాసంగా జరిగింది. ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎదుట విన్యాసాల ప్రదర్శన జరగనుంది. దీనికి రిహార్సల్‌గా గురువారం సాయంత్రం అన్నిరకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లేజర్ షో, డ్రోన్ల ప్రదర్శన నగర వాసులను అలరించాయి. ఆకాశంలో ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి పారాచ్యూట్ సాయంతో కిందకు సురక్షితంగా దిగే విన్యాసం ప్రదర్శించారు. అయితే మొత్తం నలుగురిలో ఇద్దరు క్షేమంగా కిందకు రాగా, మిగిలిన ఇద్దరు పట్టు తప్పి ఒకరి పారాచ్యూట్ మరొకరి దానికి ముడిపడి సముద్రంలో పడిపోయారు. వెంటనే నేవీ సిబ్బంది జెమినీ బోట్లలో అక్కడకు వెళ్లి పారాట్రూపర్లు ఇద్దరినీ రక్షించారు.

మిలీనియం టవర్స్‌లో టీసీఎస్

- టవర్ ఏ, బిలలో 2.08 లక్షల చదరపు అడుగుల కేటాయింపు
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- దశల వారీగా పది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటున్న ఐటీ దిగ్గజ సంస్థ
- రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి 8న ప్రధాని శంకుస్థాపన




మిలీనియం టవర్స్

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్‌లో గురువారం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విశాఖపట్నంలో కార్యకలాపాలు నిర్వహించడానికి ముందుకువచ్చిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)కు రుషికొండ ఐటీ పార్కులోని మూడో నంబరు కొండపై గల మిలీనియం టవర్-ఏ, టవర్-బీలలో మొత్తం 2.08 లక్షల చదరపు అడుగుల స్థలం కేటాయించాలని నిర్ణయించారు. టవర్-ఏలో ఎనిమిది అంతస్థులు ఉండగా అందులో మొదటి నాలుగు అంతస్థుల్లో కాండ్యుయెంట్ కంపెనీ నడుస్తోంది. పైన నాలుగు అంతస్థులు టీసీఎస్‌కు ఇస్తారు. అలాగే ఆ పక్కనే నిర్మించిన టవర్-బిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలుపుకొని ఎనిమిది అంతస్థులు ఉన్నాయి. రెండో అంతస్థు మినహాయించి భవనం మొత్తం టీసీఎస్‌కు కేటాయించారు. ఇందులో 98,373 చ.అ. స్థలం ఉండగా మిగిలిన స్థలం అంతా

... మిగతా 6వ పేజీలో

ముఖ్యమంత్రి రాక రేపు

- నేవీ డేలో పాల్గొననున్న చంద్రబాబునాయుడు



విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేవీ డేలో పాల్గొనేందుకు ఈనెల నాలుగో తేదీన నగరానికి రానున్నారు. శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో బయలుదేరి 3.40 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4.40 నుంచి 6.10 గంటల వరకూ నేవీ డే కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి బీచ్ నుంచి 6.15గంటలకు బయలుదేరి 6.50 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.



కంటిన్యుటీ ఫైర్ డ్రిల్



- మరిన్ని ఫొటోలు 8వ పేజీలో

ప్రధాని రోడ్‌షో



ఎనిమిదో తేదీన సంపత్ వినాయక ఆలయం నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా వేదిక వరకూ నిర్వహణ

- ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులకు శంకుస్థాపన చేయనున్న నరేంద్ర మోదీ
- సభకు లక్ష మంది హాజరవుతారని అంచనా
- ప్రధాని పర్యటన కార్యక్రమం పర్యవేక్షణకు ముగ్గురు మంత్రులతో కమిటీ
- నేడు ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రులు భేటీ

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. సభకు సుమారు లక్ష మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఉన్న సమాచారం ప్రకారం... ఆశీల్‌మెట్టలో గల సంపత్ వినాయక్ ఆలయం వద్ద నుంచి సభా ప్రాంగణం వరకూ ఓపెన్‌టాప్ వాహనంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌లు రోడ్‌షోలో పాల్గొంటారు.

వేదిక వద్ద ప్రధానమంత్రి పలు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ పవర్‌ప్లాంటుకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే నక్కపల్లి మండలంలో 2000 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,876.76 కోట్లతో ఏర్పాటుచేయనున్న బల్క్ డ్రగ్ పార్కు పనులను ప్రారంభిస్తారు. అదేవిధంగా నిర్మాణాలు పూర్తిచేసుకున్న దక్షిణ, తూర్పుభారతానికి చెందిన పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను ఈ వేదిక నుంచే జాతికి అంకితం చేస్తారు. కాగా ప్రధాని ఎయిర్‌పోర్టులోని ఐఎన్‌ఎస్ డేగాలో విమానం దిగిన తరువాత నేరుగా రోడ్డు మార్గాన నగరంలోకి రానున్నారు. తిరిగి ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు సభా వేదికకు సమీపంలో ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మరో మైదానంలో మూడు హెలిప్యాడ్‌లు సిద్ధంచేస్తున్నారు.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు

ముగ్గురు మంత్రులతో కమిటీ

ప్రధాని సభ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ముగ్గురు మంత్రులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ నేపథ్యంలో కమిటీలో ఉన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. జన సమీకరణ బాధ్యతను స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

అధికారులు కసరత్తు

ప్రధాని పర్యటన కోసం జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించింది. గురువారం అధికారులతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సమీక్ష నిర్వహించారు. సభ విజయవంతం కోసం 42 కమిటీలు వేశారు. ఎయిర్‌పోర్టులో

... మిగతా 6వ పేజీలో

పిల్లలు లేరని మనోవ్యధతో

యువ దంపతుల ఆత్మహత్య

ఆర్థిక సమస్యలు కూడా తోడు

పెందుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే ఆర్థిక సమస్యలకు తోడు వివాహమై ఆరేళ్లు అయినా సంతానం కలగలేదనే మనోవ్యధతో ఆత్మహత్య చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కృష్ణరాయపురంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన డబ్బీరు సంతోష్‌కుమార్ (35), విశాఖ జిల్లా గాజువాకకు చెందిన సంతోషిశ్రీ (28) ఆరేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. జీవనోపాధి కోసం దంపతులిద్దరూ కృష్ణరాయపురంలోని జీవన్ వైద్యశాలకు చెందిన మెడికల్ స్టోర్స్‌లో పనిచేస్తున్నారు. అక్కడకు సమీపంలో గల బాలాజీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇదిలావుండగా గాజువాకలో ఉంటున్న సంతోషిశ్రీ తండ్రి గురువారం ఉదయం కుమార్తె సెల్‌కు కాల్ చేశారు. ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ సతీశ్‌కుమార్, ఎస్ఐ ఆసిరి తాతలు సిబ్బందితో సంతోష్‌కుమార్ దంపతులు నివాసం ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. తలుపులు తట్టినా తీయకపోవడంతో పగులకొట్టి లోనికి ప్రవేశించారు. వంట గదిలో సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు భార్యభర్త ఉరి వేసుకుని కనిపించారు. మృతదేహాలను కిందకు దింపించి అనంతరం పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సతీశ్‌కుమార్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుల

... మిగతా 6వ పేజీలో



సంతోష్‌కుమార్ (ఫైల్ ఫొటో)



సంతోషిశ్రీ (ఫైల్‌ఫొటో)

ప్రతిభకు పట్టం

నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి అర్జున అవార్డు

- కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రకటన
- 17న రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం
- నగర క్రీడారంగానికి గౌరవం దక్కిందంటున్న ప్రముఖులు

అత్యంత వేగవంతమైన స్ప్రింటర్‌గా గుర్తింపు పొందడమే కాకుండా ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొన్న తొలి భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది నగరానికి చెందిన ఎర్రాజీ జ్యోతి. ఆమెను కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డుతో గౌరవించనున్నది. ఈనెల 17న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జ్యోతి అవార్డును అందుకోనుంది.



అథ్లెట్ జ్యోతిని అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అథ్లెట్ జ్యోతికి క్రీడా రంగంలో అత్యుత్తమ పురస్కారం లభించింది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సత్తా చాటుతూ అంతర్జాతీయ పతకాలు అందించిన జ్యోతికి ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు దక్కింది. ఏటా అత్యుత్తమ క్రీడాకారులకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అర్జున అవార్డులు ప్రకటిస్తుంది.

సాధారణ అథ్లెట్‌గా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టిన జ్యోతి క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి దేశం గర్వించదగ్గ స్థాయికి చేరింది. జాతీయ స్థాయిలో రికార్డులతో దూసుకుపోతూ వంద మీటర్ల హర్డిల్స్‌లో

... మిగతా 6వ పేజీలో



అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి

సబ్బవరం-షీలానగర్ హైవేకు నిధులు



- రూ.963.93 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటన
- పనులు ఇక వేగవంతం
- ఆ రహదారి అందుబాటులోకి వస్తే సిటీ మధ్య నుంచి వెళ్లే నేషనల్ హైవేపై తగ్గనున్న భారీ వాహనాల రాకపోకలు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం-షీలానగర్ మధ్య ఆరు వరుసల జాతీయ రహదారి (516 సి) నిర్మాణానికి రూ.963.93 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ గురువారం వెల్లడించారు. విశాఖపట్నం పోర్టుకు గాజువాక మీదుగా వచ్చే భారీ వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో వాటి రాకపోకలకు పోలీస్ అధికారులు నిర్ణీత సమయాలు కేటాయించారు. అయినా ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. దాంతో పోర్టు వర్గాలు ఈ సమస్య నివారణ కోసం అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారిలో సబ్బవరం నుంచి షీలానగర్ వరకూ మరో ఆరు వరుసల జాతీయ రహదారి (516సి) నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి 2023 అక్టోబరులోనే టెండర్లు పిలిచారు. కొన్నిచోట్ల పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ఆరు వరుసల రహదారి పొడవు 12.66 కి.మీ. ఇది పూర్తయితే అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు

... మిగతా 6వ పేజీలో

నగరంలో మీనాక్షి సందడి



వర్ధమాన సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం నగరంలో సందడి చేశారు. జగదాంబ జంక్షన్‌లో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెను చూసేందుకు జనం పోటెత్తారు. పెద్దసంఖ్యలో వచ్చిన అభిమానులతో మీనాక్షి సెల్ఫీలు తీసుకుని వారిని ఉత్సాహపరిచారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- రేపటి నుంచి ప్రారంభం
- జిల్లాలో 5,500 మంది విద్యార్థులు
- భోజనం సరఫరా బాధ్యతలు అక్షయ పాత్రకు అప్పగింత

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఈనెల నాలుగో తేదీ నుంచి మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మూడో తేదీ శుక్రవారం నుంచి భోజన పథకం అమలు చేయాలని తొలుత నిర్ణయించారు. అయితే అనివార్య కారణాలతో నాలుగో తేదీకి వాయిదా వేశారు.

జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 5,500 మంది విద్యార్థులు ఉన్నారు. నగరంలో వీఎస్ కృష్ణా జూనియర్, ఒకేషనల్ కళాశాలలు, మహిళా జూనియర్ కళాశాల ఉన్నాయి. ఇంకా మల్కాపురం, పెందుర్తి, అగనంపూడి, ఇస్లాంపేట, మధురవాడ, ఆనందపురం, భీమిలిల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో పథకం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెనూయే జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేస్తారు. ప్రతి విద్యార్థికి రోజుకు 150 గ్రాముల రైస్ అందిస్తారు. నగరంతోపాటు ఆనందపురం, భీమిలి మండలాల్లో అక్షయపాత్ర ద్వారా పాఠశాల విద్యార్థులకు భోజనం సరఫరా అవుతుంది. పెందుర్తి, పెదగంట్యాడ రూరల్ ప్రాంతాల్లో స్థానికంగా ఉండే డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు భోజనం వండి పిల్లలకు అందిస్తున్నారు. అయితే ఇంటర్ విద్యార్థులకు తాము భోజనం అందించలేమని డ్వాక్రా సంఘాలు చెప్పడంతో నగరంతో పాటు చుట్టుపక్కల గల కళాశాలలన్నింటికీ భోజనం అందించే బాధ్యతను జిల్లా యంత్రాంగం అక్షయపాత్ర సంస్థకు అప్పగించింది.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం..42 అంశాలతో ఎజెండా -7వ పేజీలో

టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మన్నాల సోంబాబు ఆధ్వర్యంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, దుక్కా శివ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సర్వ సభ్య సమావేశం

కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని దుర్గా భవాని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వైఎస్ మూర్తి అన్నారు. గురువారం కొమ్మాది సాయిరాం కాలనీలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా సంఘం పటిష్టకు, కార్మికుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం నాయకులు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కురుమోజు గోవిందరావు, జి. యోగేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుకు వినతి

మధురవాడ/కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. గురువారం భీమిలిలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె వారికి వినతిపత్రం అందించారు. వార్డులో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి నిధులు కేటాయించాలని విన్నవించారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఉన్నారు. అలాగే 5వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ మొల్లి హేమలత కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఆమెతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పరిశీలన

తగరపువలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు ఎస్. త్రినాథరావు గురువారం సందర్శించారు. ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా ఛాత్రోపాధ్యాయుల విద్యా బోధనను గమనించిన ఆయన అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పోరాడుతుందని ఆ సంఘం మధురవాడ జోన్ అధ్యక్షుడు సియాద్రి పైడితల్లి అన్నారు. గురువారం జోన్-2 కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి. అప్పలరాజు, ప్రసాద్, శేషుబాబు, రాంబాబు, కొండమ్మ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా నాగమణి

పద్మనాభం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షురాలిగా తమటపు నాగమణి ఎన్నికయ్యారు. గురువారం పద్మనాభంలో ఆ పార్టీ మండల సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. కార్యకర్తలు ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భీమిలి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» జీవీఎంసీ అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా, పక్కన కమిషనర్ సంపత్‌కుమార్

భీమునిపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలోని జోనల్ కార్యాలయంలో జోన్ ఒకటి, రెండు, ఎనిమిది కార్యాలయాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ వన్, టుకు సంబంధించి రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, పార్కులు, శ్మశానవాటికలు, తాగునీటి సరఫరా, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, లే అవుట్లలో ఓపెన్ స్పేస్‌లు, మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం గంటా మాట్లాడుతూ భీమిలి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారులను అభివృద్ధి చేసేటపుడు ఎంతమేర విస్తరణ అవసరం, ఎంతవరకూ ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లుతుందో వివరాలు సిద్ధం చేయాలన్నారు. విస్తరణలో ప్రజలు ఎక్కువగా నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రూరల్ మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రక్రియపై ప్రతిపాదనలు చేపట్టాలన్నారు. విలీన ప్రాంతాల్లో ఆస్తి పన్ను పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతాల అభివృద్ధిపై కూడా దృష్టిసారించాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం అభివృద్ధికి జీవీఎంసీ సహకరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు 2047 వరకూ నగర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భీమిలిలో నీటి సరఫరా సంతృప్తికరంగా లేనందున తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మదురవాడలో భూగర్భ మురుగనీటి కాలువల పనులు పూర్తి చేస్తామని,ఇప్పటికే కార్పొరేటర్లు సమర్పించిన వివిధ అభివృద్ధి పనులకు రూ. 24 కోట్లు మంజూరు చేశామని, 130 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, దౌలపల్లి ఏడుకొండలరావు, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, పిసిని వరహా నరసింహం, అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీరు శివప్రసాదరాజు,జోనల్ కమిషనర్లు ప్రసన్నవాణి, పణిరామ్, హేమవతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సురుశ్ కుమార్, యూసీడీ పిడి సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీరు శ్యామ్‌సన్, టీడీపీ నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, పాసి నరసింగరావు పాల్గొన్నారు. కాగా శిథిలావస్థలో ఉన్న పురపాలక సంఘం కార్యాలయాన్ని అదే స్ట్రక్చర్‌లో మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే, జీవీఎంసీ కమిషనరును ఆదేశించారు. అలాగే బీచ్‌రోడ్ నోవాటెల్ రిసార్టు తీరంలో కోతకు గురవుతున్న తీరాన్ని కమిషనరుకు ఎమ్మెల్యే గంటా చూపించారు.

టీడీపీలో చేరిన ముచ్చర్ల పంచాయతీ ప్రజలు

ఆనందపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముచ్చర్ల పంచాయతీ ప్రజలంతా మూకుమ్మడిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం స్వీకరించారు. గ్రామస్తులంతా టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ముచ్చర్ల పంచాయతీ మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉండేది. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా వైసీపీ మద్దతుదారుడైన షిణగం ఎర్రయ్య ఎన్నికయ్యారు. అప్పటి నుంచి పంచాయతీలో రెండు వర్గాలయ్యాయి. అయితే మళ్లీ కూటమి అధికారం చేపట్టాక పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అందరూ కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. పంచాయతీలో ముచ్చర్లతో పాటు జోడువానిపాలెం, గంపవానిపాలెం, తంగుడుబ్లి గ్రామాలు ఉన్నాయి. నాలుగు గ్రామాల్లో కలిపి సుమారు రెండు వేల మంది జనాభా ఉండగా...అందులో 14 వందల మంది ఓటర్లు. ఇప్పుడు అంతా టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్నారు. అందరినీ ఒక్కటి చేయడంతో మాజీ సర్పంచ్ లెంక అప్పలనారాయణ సఫలీకృతులయ్యారు. సర్పంచ్ ఎర్రయ్య ఇంకా పార్టీలో చేరలేదు. ఇటీవల ఎమ్మెల్యే గంటా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఎర్రయ్య కూడా త్వరలో టీడీపీలో చేరనున్నట్టు చెబుతున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఈనెల 7న నగరానికి వస్తున్న మంత్రి నారా లోకేశ్ ముచ్చర్ల గ్రామాన్ని సందర్శించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

క్రీడలతో శారీరక ఉల్లాసం


క్రీడాకారులతో బెటాలియన్ కమాండెంట్ మురళీ కృష్ణ

కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కమాండెంట్ కేవీ మురళీ కృష్ణ అన్నారు. గురువారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో అనేక బాధ్యతలతో ఇబ్బందులు పడుతుంటారని, ఒత్తిడిని జయించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ఆయనకు అడిషనల్ కమాండెంట్ పద్మనాభ రాజు స్వాగతం పలికారు.

కళల సంరక్షణ అవసరం

సాగర్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నేటి ప్రపంచంలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అమెరికా పండితురాలు, నర్తకి, రచయిత డాక్టర్ రొక్సాన్న కామయాని అన్నారు. ఆధునిక భారతీయ కళలు - సంప్రదాయాల పరిరక్షణ అన్న అంశంపై గీతం వర్సిటీ ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. సంగీతం, నాటక అకాడమీల వల్ల భారతీయ కళలు ఇప్పటికీ ప్రాభవాన్ని కోల్పోకుండా ఉన్నాయని తెలిపారు. అయితే కళారూపాల పరిరక్షణలో యువత క్రమంగా ఆసక్తి కోల్పోతున్నారని, దాని వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పెంటలో రెవెన్యూ సదస్సు

పద్మనాభం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. గురువారం పెంట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూవివాదాలు ఉన్న వారు సదస్సులో అర్జీలు అందించాలని కోరారు. అనంతరం ఆయన రైతుల నుంచి 34 వినతులు స్వీకరించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోదల పావని. గౌరీ శంకర్, ఎంఆర్ఐ శ్యామల, సర్వేయర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

ఎండాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. కొమ్మాది వైఎస్సార్ కాలనీలో ఉంటున్న వేనన చరణ్ కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. గురువారం పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కాలనీ సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాల ప్రాంతంలో గొల్లపల్లి కిశోర్ బైక్‌తో అకస్మాతుగా రోడ్డుపైకి రావడంతో చరణ్ ప్రశ్నించాడు. దీంతో కోపంతో ఊగిపోయిన కిశోర్ కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. చరణ్‌ను కుటుంబీకులు గాయత్రి ఆసుపత్రిలో చేర్చారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జూట్ మిల్లు స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

తగరపువలస, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం ఆధీనంలో ఉన్న స్థలాల అమ్మకం జరగకుండా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు గురువారం హెచ్చరిక బోర్డులు పాతారు. మిల్లు యాజమాన్య ప్రతినిధులు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఒప్పందాలు చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు ఆయా స్థలాలను పరిశీలించారు. అప్పటికప్పుడు హెచ్చరిక బోర్డులు తయారు చేయించి, అక్కడ పాతిపెట్టారు. స్థలాల్లోకి వెళ్లకుండా అడ్డంగా గోడలు కూడా నిర్మిస్తు న్నారు. కొనుగోలుదారులు ఎవరూ ఆయా స్థలాల్లోకి ప్రవేశించకుండా ఈ చర్యలు తీసుకున్నామని నాయ కులు ఎం. ఆదినారాయణ, డి. అప్పలరెడ్డి తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మిల్లు యాజమాన్యాన్ని రప్పించి కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నాలుగు నెలలు క్రితం హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు నెరవేర్చలేదని చెప్పారు. కార్మికులకు ఎటువంటి పరిహారాలు ఇవ్వకుండా యాజమాన్యం మిల్లు భూములను అమ్ముకోవాలని యత్నించడం దారుణమని తెలిపారు. కార్మికుల మొత్తం బకాయిలు చెల్లించిన తరువాతే భూముల అమ్మకాలు జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, కార్య దర్శి వెంకటరమణ, టీఎన్‌టీయూసీ కార్యదర్శి నరవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. వారికి ఆలయ ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలు అందజేశారు.

చేనేత వస్త్ర మేళా ప్రారంభం

మధురవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చేనేత వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత చేనేత వస్త్ర మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ చేనేత వస్త్రాలను ధరించి, కళాకారులను ఆదరించాలని కోరారు. కాగా మేళాలో 87 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఈనెల 16 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల సందీప్, 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, నాయకులు పిళ్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు,దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, కానూరి అచ్చుతరావు, శాఖరి శ్రీనివాస్, శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల మృతిపై దర్యాప్తు జరపాలి


రుషికొండ బీచ్‌లో తాబేలు కళేబరాన్ని తొలగిస్తున్న దృశ్యం

భీమునిపట్నం/భీమునిపట్నం రూరల్/సాగర్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీర ప్రాంతాల్లో తాబేళ్ల మృతి పట్ల దర్యాప్తు జరపాలని పలువురు కోరుతున్నారు. అన్నవరం నుంచి తిమ్మాపురం వరకు ఉన్న తీరంలో పది రోజులుగా మృతి చెందిన తాబేళ్లు కనిపిస్తున్నాయి. చనిపోయి రెండు మూడు రోజులు కావడంతో వాటి కళేబరాల వల్ల దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. కొన్ని పంచాయతీల్లో వీటిని ఇసుకలో పూడ్చి పెట్టడంతో పాటు కొన్నింటిని చెత్త బళ్లపై వేసి దూరంగా తీసుకువెళ్లి ఖననం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం అనేక ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడ్డాయి చాలా ఏళ్ల తరువాత తీరంలో మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోంది. మండలంలో ఉన్న రసాయనిక కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల ఈ మరణాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటు న్నారు. కాగా భీమిలి తీరం గురువారం తాబేళ్ల కళేబరాలతో నిండిపోయింది. ఒక్క రోజే 13 తాబేళ్ల కళేబరాలు ఒడ్డున పడివున్నాయి. దుర్వాసన రావడంతో వాకర్స్ జీవీఎంసీ పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆయన సిబ్బందితో సహా తీరానికి చేరుకుని తాబేళ్ల కళేబరాలను డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా శానిటరీ విభాగం అధికారులు మాట్లాడుతూ ఇటీవల ఒక్క భీమిలి తీరంలోనే 45 వరకూ తాబేళ్లు మృత్యువాత పడ్డాయని తెలిపారు. రుషికొండ, సాగర్ నగర్, ఐటీ సెజ్ బీచ్, రామానాయుడు స్టూడియో ఎదురుగా ఉన్న తీరాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలను కూడా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు రెండు నెలలుగా తాబేళ్ల కళేబరాలు కొట్టుకువస్తున్నాయి. దుర్వాసనతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటివరకూ పది కళేబరాలను తొలగించారు.

అప్పన్న ఆలయంలో వైదిక ఉత్సవాలు

సింహాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో ఈనెలలో పలు ఉత్సవాలు జరగనున్నాయి. 9న పగల్‌పత్ ఉత్సవాల ముగింపు, 10న స్వామివారి ఉత్తరద్వార దర్శనం, ధారోత్సవాల ప్రారంభం, 11న రాపత్తు ఉత్సవాల గ్రామ తిరువీధి, కూడారై ఉత్సవం, 13న భోగి, సంక్రాంతి సంబరాలు, గోదాదేవి కల్యాణం, ఎదురు సన్నాహం, రాపత్తు తిరువీధి,14న పునర్వసు నక్షత్రం శ్రీరామ సర్గ విన్నపం, ధారోత్సవాలు పూర్తి, మకర సంక్రమణం, సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణ హవనం చేయనున్నారు. 15న కనుమ, కొండదిగువన పూదోటలో గజేంద్ర మోక్షం, మకరవేట ఉత్సవం, గజ వాహనంపై కొండదిగువ గ్రామంలో తిరువీధి, రాపత్తు తిరువీధి, 16న స్వర్ణ పుష్పార్చన, రాపత్తు తిరువీధి, 18న ఆండాళ్ మాస తిరు నక్షత్రం, 19న స్వర్ణపుష్పార్చన, నమ్మాళ్వార్ పరమపదోత్సవం, ధూపానంతర తిరువీధి, రాపత్తు ఉత్సవాలు పరిసమాప్తం, 20న కూరత్తాళ్వార్ తిరునక్షత్రం, 22న స్వాతి నక్షత్ర హవనం, 23న నమ్మాళ్వార్ మాస తిరునక్షత్రం, 25న స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించనున్నారు.

మాస్టర్ ప్లాన్ రహదారి పూర్తికి చర్యలు : ఎమ్మెల్యే గంటా


రహదారి విస్తరణ కోసం తొలగించిన ఇళ్ల శిథిలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కొమ్మాది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రహదారిని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో మాస్టర్ ప్లాన్ రహదారి అభివృద్ధి కోసం తమ ఇళ్లను తొలగించి టీడీఆర్‌లు ఇవ్వడం లేదని స్థానికులు ఎమ్మెల్యేను ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు గురువారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి మాస్టర్ ప్లాన్ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో గంటా మాట్లాడుతూ 2014-19 మధ్య తాను భీమిలి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జాతీయ రహదారి నుంచి బక్కన్నపాలెం మీదుగా మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టామని, అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న పనులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విస్తరణలో భాగంగా కూల్చిన ఇళ్ల డెబ్రిస్ తొలగించకుండా స్థానికులు ఆందోళన చేపట్టినా గత ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. టీడీఆర్ సమస్య పరిష్కరిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చానని, ఆ మేరకు టీడీఆర్‌లు మంజూరు చేసి హామీ నెరవేరుస్తామని తెలిపారు. మధురవాడ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతం మరో గచ్చిబౌలి, హైటెక్ సిటీలా అభివృద్ధి చెందనుందన్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ రేవళ్లపాలెం గ్రామానికి సంబంధించి టీడీఆర్‌ల విషయంలో అధికారులతో సమీక్ష జరిపానని, నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో నాయకులు పంచకర్ల సందీప్, యార్లగడ్డ జీవన్, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, వాండ్రాసి అప్పలరాజు, దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, గొల్లంగి ఆనందబాబు, మన్నాల సోంబాబు,పోతిన ఎల్లంనాయుడు, పోతిన రఘు, గొల్లంగి ఆనందబాబు, పోతిన శ్రీనివాసరావు, పిళ్లా రమణ, తదితరులు పాల్గొన్నారు.


తిరువీధిలో ఊరేగుతున్న స్వామివారు

అప్పన్న ఆలయంలో పగల్‌పత్ సేవ

సింహాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి పగల్‌పత్ సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు పూర్తిచేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సర్వాభరణాలతో శోభాయమానంగా అలంకరించి బంగారు తొళ్ళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ బేడామండప తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. మార్గంలో దిక్పాలకులకు పూజలు చేశారు. భక్తుల హరినామస్మరణతో ఆలయం మార్మోగింది. తరువాత ఆస్థానమండపంలో ప్రత్యేక వేదికపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేసి స్థానాచార్యులు రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు.

మిలీనియం టవర్స్‌లో టీసీఎస్

... 5వ పేజీ తరువాయి

టవర్-ఏలో ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఐకానిక్ టవర్లు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలో ఉన్నాయి. వీటిని డీనోటిఫై చేశాక టీసీఎస్‌కు అప్పగించనున్నారు. దీనికి ముందు నాన్ సెజ్ ఏరియాలో డల్లాస్ టెక్నాలజీస్ నిర్మించిన భవనాన్ని తీసుకోవడానికి టీసీఎస్ ముందుకువచ్చింది. లీజు ఒప్పందం కూడా జరిగింది. అయితే టీసీఎస్ కోరిక మేరకు మిలీనియం టవర్లను కేటాయించారు. వీటిలో షిఫ్ట్‌నకు రెండు వేల మంది పనిచేసుకునే వెసులుబాటు ఉంది. ఆ సంస్థ మొత్తం దశల వారీగా పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించింది.

ఇదిలావుండగా ఈ నెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం వచ్చే ప్రధాని నరేంద్రమోదీ విశాఖ కేంద్రంగా మంజూరైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని సీఎం చంద్రబాబునాయుడు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. ముడసర్లోవలో జీవీఎంసీ కేటాయించిన భూముల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం జరగనుంది. దీనికి ఇప్పటికే రూ.150 కోట్లు నిధులు కేంద్ర బడ్జెట్‌లో మంజూరుచేశారు.

ప్రధాని రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

ప్రధాని దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకూ ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకునే బాధ్యతను ఈ కమిటీలకు అప్పగించారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఆర్డీవోలు, పోలీస్ అధికారులను ఈ కమిటీల్లో నియమించారు. విశాఖ పోర్టుతోపాటు మరికొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు కొన్ని బాధ్యతలు అప్పగించారు.

సబ్బవరం-షీలానగర్ హైవేకు నిధులు

... 5వ పేజీ తరువాయి

సబ్బవరం వద్ద ఏర్పాటు చేసే ఇంటర్ చేంజ్ వద్ద డైవర్షన్ తీసుకొని షీలానగర్ మార్గంలోకి వచ్చేస్తాయి. అక్కడి నుంచి విమానాశ్రయం పక్కనున్న మార్గంలో పోర్టుకు వెళతాయి. దీంతో నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి(16)పై భారీ వాహనాల రాకపోకలు తగ్గుతాయి. ప్రమాదాల సంఖ్య కూడా తగ్గనుంది.

ప్రతిభకు పట్టం

... 5వ పేజీ తరువాయి

అంతర్జాతీయస్థాయిలో తిరుగులేని స్ప్రింటర్‌గా పతకాలు సొంతం చేసుకున్నది. గత ఏడాది చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో 100 మీ. హర్డిల్స్‌లో రజత పతకం సాధించింది. ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో 100 మీటర్ల హర్డిల్స్‌లో కేవలం 13.09 సెకన్లలో లక్ష్యం చేరుకుని స్వర్ణ పతకం గెలుచుకుంది. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకం దక్కించుకుంది.

ఆమె పేరునే జాతీయ రికార్డు

జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్స్‌లో ఇప్పటివరకు 37 పతకాలు సాధించిన జ్యోతి ఎర్రాజీ గత ఏడాది గుజరాత్‌లో జరిగిన 36వ నేషనల్ గేమ్స్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.79 సెకన్లతో స్వర్ణ పతకం సాధించి కొత్త రికార్డును నెలకొల్పింది. ఆ రికార్డు ఇప్పటికీ ఆమె పేరున ఉంది.

అంతర్జాతీయ మెరుపులు

ఏషియన్ గేమ్స్ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్యం, సైప్రస్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, లౌబోరోగ్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, నెదర్లాండ్‌లో జరిగిన హ్యారీ స్కల్టింగ్ గేమ్స్, అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, ఐఎఫ్ఏఎం ఇంటర్నేషనల్ ఫ్లాండర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో రజతం, నెదర్లాండ్స్‌లో జరిగిన ఎలైట్ ఇండోర్ ట్రాక్ అథ్లెటిక్స్ మీట్‌లో రజతం, కజకిస్తాన్‌లో జరిగిన పదో ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 60 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాలు సాధించింది.

రాష్ట్రానికి గర్వకారణం

ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు ఎర్రాజీ జ్యోతికి ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆమె ప్రతిభకు జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పట్టం కట్టాయి. అత్యున్నత టోర్నీలలో పతకాలు అందించిన జ్యోతి.. 40 ఏళ్ల తర్వాత విశాఖ నుంచి ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఆమెకు అర్జున అవార్డు ప్రకటించడం రాష్ట్ర క్రీడారంగానికి గర్వకారణం.

- గణబాబు, ప్రభుత్వ విప్

ఎంపీ అభినందనలు

అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతిని ఎంపీ శ్రీభరత్ అభినందించారు. ఎంపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శ్రీభరత్ మాట్లాడుతూ జ్యోతి క్రీడా ప్రస్థానం, విజయాలు విశాఖ నగరానికి గర్వకారణమే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతోమంది యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలిచాయన్నారు. ఈ వార్డు ఆమె క్రీడా ప్రయాణంలో ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

మనోవ్యథతో యువ దంపతుల ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

బంధువులను విచారించారు. పెళ్లై ఆరేళ్లవుతున్నా సంతానం కలగలేదని తరచూ మథనపడుతుండేవారని పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడం, బంధువులు దూరం పెట్టడం వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. వారిద్దరి సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీఎస్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరి తాత కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం ప్రీమియం స్టోర్‌లకు రీ నోటిఫికేషన్

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు మద్యం ప్రీమియం స్టోర్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ రీ నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుదారులు రూ.15 లక్షలు (నాన్ రిఫండ్) డీడీ తీసి అందజేయాల్సి ఉంటుంది. లాటరీలో స్టోర్ దక్కిన వారికి ఐదేళ్ల వ్యవధికి లైసెన్స్ జారీ చేస్తారు. ప్రీమియం స్టోర్‌కు లైసెన్స్ ఫీజు కింద మొదటి ఏడాది రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది నుంచి పది శాతం చొప్పున లైసెన్స్ ఫీజు పెరుగుతుంది. స్టోర్ ఏర్పాటు చేయడానికి కనీసం నాలుగు వేల చదరపు అడుగులు వైశాల్యం కలిగిన భవనం ఉండాలి. ప్రీమియం స్టోర్‌లో మద్యం బ్రాండ్‌లను కొనుగోలుదారులకు తెలిసే ఆకర్షణీయమైన ర్యాక్‌లు, ఇంటీరియర్‌తో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. రెండు ప్రీమియం దుకాణాలకు గత నెల 17న నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎవరూ దరఖాస్తు చేయకపోవడంతో రీ నోటిఫికేషన్ జారీ చేశారు. స్టోర్ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగానీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నేరుగా గానీ ఏడో తేదీలోగా అందజేయాలని సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

- నత్త నడకన దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు
- కొంతమందికే మంజూరైన టీడీఆర్‌లు
- మిగతా వారు జీవీఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదని ఆవేదన


విస్తరణకు నోచుకోని దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు

కూర్మన్నపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో 60 అడుగుల నుంచి వందడుగుల రోడ్డు విస్తరణ పనులను 2023 అక్టోబరు నాలుగున రూ.11.39 కోట్లతో అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో తారు రోడ్డు నిర్మాణ పనులకు రూ. 3.70 కోట్లు, కాలువల నిర్మాణానికి రూ.5.86 కోట్లు, నడకదారి నిర్మాణానికి రూ.1.83 కోట్లను కేటాయించారు. అయితే ఇప్పటికీ 14 నెలలు గడిచినా కేవలం 25 శాతం పనులు మాత్రమే జరిగాయి. పేదలకు ఓ న్యాయం-పెద్దలకు మరో న్యాయం అన్నట్టుగా రోడ్డు విస్తరణ పనులు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారి సెంటర్‌కు ఇరువైపులా సక్రమంగా లైన్ల మార్కింగ్ చేయలేదని, ఒకవైపు కన్నా మరోవైపు సుమారు మూడు అడుగులు అదనంగా మార్కింగ్ చేశారని, దీనివల్ల తాము ఎంతో నష్టపోతున్నామని పలు భవనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల వల్లే తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు.

విస్తరణ పనులకు అవరోధాలు

రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి నాలుగు రెట్ల టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో 166 మంది నుంచి స్థలాలు సేకరించారు. కానీ కేవలం 84 మందికి మాత్రమే టీడీఆర్‌లు ఇచ్చారని, మిగిలిన 82 మందికి ఇప్పటికీ మంజూరు చేయలేదని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. తమ స్థలానికి సంబంధించి గిఫ్ట్ డీడ్‌లను జీవీఎంసీకి పలువురు ఇచ్చినప్పటికీ ఇంతవరకు టీడీఆర్‌లు మంజూరు చేయలేదంటున్నారు. వీటికోసం జీవీఎంసీ చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని పలువురు భవన యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా అసంపూర్తి రోడ్డు విస్తరణ పనుల వల్ల స్టీల్‌ప్లాంట్, వీఎస్ఈజెడ్ కార్మికులు, రైల్వే ప్రయాణికులు, విద్యార్థులు, ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ పూర్తయితే రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చని పలు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

- 42 అంశాలతో ఎజెండా
- అస్మదీయులైన కాంట్రాక్టర్లకు చెత్త వాహనాల నిర్వహణ అప్పగింత

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరుగుతుందని కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం కోసం 42 అంశాలతో ఎజెండా తయారుచేశారు.

2024 సెప్టెంబరులో నగరంలోని 30 పాఠశాలల్లో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ ఇచ్చినందుకు ఓ ఎన్‌జీవోకు రూ.1.5 లక్షలు చెల్లింపు, పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల వాడకంపై అవగాహన కల్పించేందుకు గ్రీన్ ఎన్విరో అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్లానింగ్ కన్సల్టెంట్‌కు రూ.80 వేలు, దీనిపై వెయ్యి పుస్తకాలను ముద్రించి కార్మికులకు అందజేసేందుకు రూ.మూడు లక్షలు చెల్లింపునకు అనుమతి అంశాలను ఎజెండాలో చేర్చారు. అలాగే వార్డుల్లో చెత్త తరలించేందుకు జీవీఎంసీకి చెందిన 6 సీఎంటీ సామర్థ్యం కలిగిన వాహనాలను నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే అంశాలను ఎజెండాలో చేర్చారు. అయితే ఒకే వార్డులో పని చేసిన వాహనాలకు నిర్వహణ ఖర్చులను ఒకే బిల్లుగా కాకుండా పది రోజులు చొప్పున విడదీసి చెల్లించాలని ప్రతిపాదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.ఐదు లక్షలు దాటితే టెండరు పిలవాల్సి ఉంటుంది కాబట్టి, రూ.ఐదు లక్షలలోపు బిల్లు వచ్చేలా పది రోజులు చొప్పున విడదీసి అస్మదీయులైన వారికి నామినేషన్‌పై అధికారులు కాంట్రాక్టులు ఇచ్చేశారని ప్రచారం జరుగుతోంది. అలాగే పలుజోన్లలో దుకాణాలు వేలం, రాత్రి శానిటేషన్ విధులు నిర్వర్తించే కార్మికులకు వేతనాలు చెల్లింపు, లాంగ్‌లీవ్‌లో ఉన్న అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల స్థానంలో తాత్కాలిక కార్మికుల నియామకం వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

సింధియా/మల్కాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం సబ్‌స్టేషన్ 11కేవీ షిప్‌యార్డు-1 ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా యారాడ గ్రామం, లైట్ హౌస్, రాడర్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని అందరూ గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

'స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరచాలి'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరిచి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి సీజీఎంను ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. గురువారం ఆయన ఆస్పత్రిలో సీజీఎంను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో మందులను అందుబాటులో ఉంచాలని, స్పెషలిస్టుల సంఖ్యను పెంచాలని, ఎంవోయూ విషయంలో ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్రశిక్షా ఏపీసీగా చంద్రశేఖరరావు


చంద్రశేఖరరావు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షా అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటరుగా డాక్టరు జె.చంద్రశేఖరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయనను ఏపీసీగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, శాస్త్రీయ దృక్పథం అలవడేలా కృషి చేస్తానన్నారు. సైన్స్‌పై మరింత అవగాహన పెరిగేలా బోధన చేయాల్సి ఉందన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రయోగశాలపై ఆసక్తి కనబర్చేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించాలని ఆకాంక్షించారు. చదువు, క్రీడలు విద్యా వికాసానికి దోహదపడతాయన్నారు.

సభ్యత్వ నమోదుకు సైనికుల్లా పని చేయాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కోరారు. వార్డు పరిధిలోని తిరుమల నగర్‌లో గురువారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు వార్డు పరిధిలో నాలుగు వేల సభ్యత్వ నమోదులు జరిగాయని, వీటిని మరింత పెంచేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వార్డులో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కాలనీ ప్రగతికి కృషి చేస్తున్న జగన్‌ను కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకుడు ఎస్ఎస్ విజయరామరాజు, అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, పరమానందం, నాగభూషణం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరి రిజర్వ్‌పోలీసు మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో మెరిట్ టెస్టులకు హాజరుకావాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. కాగా గురువారం పురుష అభ్యర్థులకు జరిగిన మెరిట్ టెస్టులకు 600 మందికి గానూ 228 మంది హాజరయ్యారు. చెస్ట్, బరువు, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు ఈవెంట్లు నిర్వహించారు. తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, మైదానంలోకి అనుమతించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు బాలసూర్యారావు, కల్యాణి పాల్గొన్నారు.

రిటెయినింగ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ

పెదగంట్యాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీకాలనీ కొండవాలు ప్రాంతంలో రిటెయినింగ్ వాల్ నిర్మాణానికి కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గురువారం భూమి పూజ చేశారు. వర్షాల సమయంలో కొండపై నుంచి మట్టి, రాళ్లు పడకుండా రిటెయినింగ్ వాల్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే కొండవాలు ప్రాంతాల ప్రజల ఇబ్బందులు తీరినట్టవుతుంది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దేవస్థానం, వుడా భూ సమస్యల పరిష్కారానికి కృషి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు


రెవెన్యూ సదస్సులు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్డీసీ సీతారామారావు

వేపగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93, 94, 95, 96 వార్డుల పరిధిలో అధికంగా ఉన్న దేవస్థానం, వుడా భూముల సమస్యలను రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా దేవస్థానం, భూ సమస్య, వుడా భూ వివాదం నెలకొని ఉందని, వీటిపై అటు దేవస్థానం, ఇటు వీఎంఆర్డీఏ ఉన్నతాధికారులకు ఆయా సమస్యల వినతులను అందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావు, ముమ్మన దేముడు అధికారులకు వివరించారు. ఈ సదస్సులో 220 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటిలో అధికంగా వుడా భూ సమస్యలకు సంబంధించి 105, దేవస్థానానివి 108, రెవెన్యూకు సంబంధించి 12 సమస్యలపై అర్జీలు వచ్చినట్టు పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కాగా ఈ సదస్సుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వస్తారని, దేవస్థానం, వుడా సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేస్తారని అందరూ భావించారు. ఆయన రాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ డీటీ భారతి, దేవస్థానం అధికారులు, రెవెన్యూ డీటీ శ్రీనివాసరావు, కూటమి నాయకులు పిన్నింటి పార్వతి, టి.శ్రీనివాసరావు, చైతన్య, జుత్తాడ శ్రీనివాసరావు, దేముడు, మామిడి కిరణ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం నేడు ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా చేయనున్నట్టు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ఉదయం ఏడున్నరకు ధర్నా చేపడతామని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొనవలసిందిగా కోరారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆర్పీపేట, (కంచరపాలెం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 56వ వార్డు పరిధి ఆర్పీపేటలో గురువారం రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. ఆర్పీపేట విద్యుత్ కార్యాలయం పక్కన గల రోడ్డు మరమ్మతులకు గురవ్వడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు నిర్మాణానికి రూ.19.5 లక్షల నిధులను కార్పొరేటర్ మంజూరు చేయించారు. ఈ మేరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 44, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 50, బరబాటి 42, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36 దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 32, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


తులసి మాలలు, పుష్పాలతో అలంకృతుడైన గ్రీన్ సిటీ వేంకటేశ్వరస్వామి


పెందుర్తి వెంకటాద్రిపై నవనీతంతో దర్శనమిస్తున్న శ్రీవారు

కూర్మన్నపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధనుర్మా సోత్సవాల్లో భాగంగా 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి గురువారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు వాసుస్వామి, శ్రీధర్ స్వాములు శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, తులసి మాలలతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం పలువురు భక్తులు అన్నమాచార్యుని గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ బండి సురేశ్‌కుమార్, పద్మజ, వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సునీల్, వెలగ వెంకటరావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి ప్రత్యేక పూజలతో పాటు శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి వేదపండితులు శాంతి కల్యాణాన్ని జరిపారు. పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే ఇక్కడి శాతవాహన నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయినాథునికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఇరగవరపు శ్రీధర్ పర్యవేక్షణలో కాగడా హారతి, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాల చేశారు. అష్టోత్తర శత నామాలతో అర్చనలు, పూజలు జరిపారు. ఈ సందర్భంగా బాబాను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పలువురు భక్తులు సుందరకాండ పారాయణం, భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం సాయినాథుని ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. రాత్రి రొట్టెలను బాబాకు నైవేద్యంగా సమర్పించాక భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కాట్రగడ్డ దుర్గాప్రసాద్, బి.శేషగిరిరావు, ఎం.శ్రీనివాసరావు, సాయిరామ్, ధనుంజయరెడ్డి, జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నవనీత వెంకన్నకు భక్త నీరాజనం

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం స్వామివారిని దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శ్రీవారికి అలంకరణకు 27 కిలోల వెన్నను వినియోగించినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. తొలుత ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భక్తులు సామూహిక తిరుప్పావై పారాయణాన్ని పఠించారు. అర్చకులు గోదాదేవి పాశురాన్ని స్వామికి నివేదించారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

అగనంపూడి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాగణంలో లలిత, విష్ణుసహస్రనామ, బాబా చాలీసాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, రాజు, లీలావతి, సత్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'శంకర్ ఫౌండేషన్'లో 33,175 నేత్ర శస్త్ర చికిత్సలు

వేపగుంట జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి నాయుడుతోటలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గత ఏడాది 33,175 నేత్ర చికిత్సలు చేసి అరుదైన ఘనత సాధించినట్టు ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో నిర్వహించిన 33,175 కంటి శస్త్ర చికిత్సల్లో 68 శాతానికి పైగా వైఎస్సార్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కింద చేసినవేనన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 505 ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 34,305 మందికి నేత్ర పరీక్షలు చేసి, 12,903 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిపామన్నారు. నేత్ర వైద్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు గాజువాక, మధురవాడ, మద్దిలపాలెం, శ్రీకాకుళం కేంద్రాల్లో ఆస్పత్రులను నిర్మించామన్నారు. గత ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించడంలో కృషి చేసిన వైద్యులు, సిబ్బందికి మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణ అభినందనలు తెలిపారు.

మహిళా క్రికెటర్‌కు 'జియ్యాని' అభినందనలు


షబ్నమ్‌ను సత్కరిస్తున్న జియ్యాని శ్రీధర్

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మలేసియాలో జరగనున్న అండర్-19 ప్రపంచ కప్ మహిళా క్రికెట్‌కు భారత్ తరఫున రెండోసారి ఎంపికైన నగరానికి చెందిన షబ్నమ్ షకీల్‌ను గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తమ నివాసంలో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. అండర్-19 ప్రపంచ కప్ పోటీల్లో విశాఖ నగర కీర్తిని మరింత పెంచేలా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

పైపు లైన్‌కు మరమ్మతులు పూర్తి: నీటి సరఫరా పునరుద్ధరణ

అగనంపూడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద అండర్ గ్రౌండ్‌లో పగిలిన 60ఎంఎం ప్రధాన పైపు లైన్‌కు మరమ్మతులను జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు యుద్ధప్రాతిపదికిన పూర్తి చేశారు. రెండు రోజుల కిందట పైపు లైన్ ఒత్తిడికి గురవ్వడంతో అండర్ గ్రౌండ్‌లో ఉన్న పైపు పగిలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో 77, 79, 85, 85, 88 వార్డుల్లోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో జీవీఎంసీ ఎక్స్‌కవేటర్ సాయంతో సీసీ రోడ్డును తవ్వి కిందనున్న పైపు లైన్‌ను బయటకు తీసి మరమ్మతులు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి రెండు గంటలకు మరమ్మతు పనులు పూర్తి చేసి అన్ని ప్రాంతాలను నీటి సరఫరాను పునరుద్ధరించినట్టు ఏఈ కేదార్‌నాథ్ తెలిపారు. పైపు లైన్ పగిలిపోవడంతో అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వినతి

పెదగంట్యాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన పూర్తి జీతం చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్‌ను గురువారం వినతిపత్రం అందజేశారు. జీతాలు సకాలంలో అందక ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, జి.సత్యారావు, యెల్లేటి శ్రీనివాసరావు, మంత్రి గోపీనారాయణ, అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం: ఎంఈవో

అక్కిరెడ్డిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లు పూర్తి స్థాయిలో కృషి చేయాలని గాజువాక ఎంఈవో డి.విశ్వనాథం అన్నారు. మిందిహైస్కూల్‌లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పాత్ర-బాధ్యతలు అనే అంశంపై గాజువాక మండలంలోని వివిధ పాఠశాలల ఎస్ఎంసీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు వాటి అమలుకు కమిటీలు కృషి చేయాలన్నారు. ఎంఈవో ఎం.సునీత మాట్లాడుతు స్కూల్ కమిటీల ఎన్నికలతో పాటు పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, పర్యావరణ పరిరక్షణ వంటి వాటిని విజయవంతం చేసేందుకు ఎస్ఎంసీలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పీవీఎస్ఎస్ ఆంజనేయ, ఎ.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

5న జగదల్‌పూర్ వరకే కిరండోల్ రైలు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని కిరండోల్, కోరాపుట్ సెక్షన్ మధ్య సబ్ వే నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 5న విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ (18514) రైలు విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18513) ఈ నెల 6న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే విశాఖ-కిరండోల్ పాసింజర్ రైలు (58501) ఈ నెల 6న విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ పాసింజర్ రైలు (58502) ఈనెల 7న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతుందని పేర్కొన్నారు. జగదల్‌పూర్, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

సింధియా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి జై ఆంధ్రా కాలనీలో ప్రారంభమైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని కాలువలు, రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు గుడేల కృష్ణ, జెర్రిపోతుల నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

మల్కాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు యాదవ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. క్యాలండర్‌ను ఆవిష్కరించిన సంస్థ అడిషనల్ జనరల్ మేనేజర్ సదాశివరావు మాట్లాడుతూ సంఘం సంక్షేమంతో పాటు అందరూ షిప్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉరుకూటి మురళీయాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్, కోశాధికారి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి నాయుడుతోటలో పెందుర్తి మండల యాదవ సంఘ నాయకులు గురువారం సాయంత్రం సమావేశమ య్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చందక చలపతిరావు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం అభివృద్ధికి చేయాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అయితి సింహాచలం, సంఘం ప్రతినిధులు బి.రాంబాబు, ఎర్నిబాబు, విష్ణు, కె.శ్రీను, కె.చందు, దేముడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కును పట్టించుకునేవారే లేరు

» నిర్వహణ లోపం కారణంగా కళావిహీనం » వృథాగా వ్యాయామ పరికరాలు » జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం

అక్కయ్యపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాస నగర్‌లో దాడి రామ్మూర్తి కల్యాణమండపం సమీపంలో గెడ్డకు ఆనుకుని ఉన్న పార్కు నిరుపయోగంగా ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ నిధులతో పార్కుగా రూపొందించి అందులో జిమ్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఈ



పార్కులో విరిగిన వ్యాయామ పరికరాలు



శ్రీనివాసనగర్‌లో పార్కు ముఖ ద్వారం

పార్కులో కొద్ది రోజులపాటు ఉదయం, సాయంత్రం సేదదీరి వ్యాయామం చేసేవారు. పిల్లలు కూడా ఆడుకునేవారు. నిర్వహణ లోపం కారణంగా పార్కు కళావిహీనంగా తయారైంది. ఆ తర్వాత పార్కు లోపలకు ఎవరూ వెళ్లకపోవడంతో తాళాలు వేశారు. జారుడు బల్లలు, ఊయల, జిమ్ పరికరాలు విరిగిపోతున్నాయి. వాటిపై చెత్త పేరుకుపోయింది. జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు స్పందించి ఈ పార్కు స్థలంలో పేదలకు ఇళ్లు నిర్మించాలని అక్కయ్యపాలెం మండల బీజేపీ అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి సూచించారు.

తెలుగును కాపాడే బాధ్యత బడుగులకేనా?

» విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డా. వెంకటరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

సీతమ్మధార, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా వికాసం ముసుగులో బడుగుల విద్యా భవిష్యత్‌ను నాశనం చేయొద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ఆపేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంగీకరించరని విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు హెచ్చరించారు. మహాసభల తీర్మానాలు, చర్చల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం రద్దు చేయాలనే అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో ఆ తీర్మానాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవద్దని సూచించారు. ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని విదసం నేతృత్వంలో దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ జగన్ పాలనలో జరిగిన పాలనపై పోరాటంలో దళితులు అగ్రభాగాన నిలబడ్డారని, దాంతో కూటమి విజయం సాధించిందన్నారు. కూటమికి అండగా నిలబడ్డ బడుగుల పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువులు దూరం చేయొద్దని హితవు పలికారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సొడదాసి సుధాకర్, జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గొల్లమాల అప్పారావు, వి.దుర్గారావు, మూర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అబిద్‌నగర్, షాదీఖానా, ఎంటీసీ పాలెం, బీఎండబ్ల్యూ షో రూమ్, ద్వారకానగర్, మధురానగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రామకృష్ణానగర్, లలితానగర్, మండావారిపేట, దొండపర్తి, డైమండ్‌పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రీసెర్చ్ పార్కు ఏర్పాటు చేయాలి

మురళీనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు స్టడీ రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని స్టేట్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ విభాగం ఇన్‌చార్జి మూల.వెంకటరావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

ఎస్‌ఎంసీ సభ్యులకు శిక్షణ తరగతులు



అబ్జర్వర్ కల్పనతో శిక్షణలో పాల్గొన్న సీఆర్పీలు

అక్కయ్యపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలఅభివృద్ధికి తోడ్పడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా చూడాలని విశాఖ విజనరీ అబ్జర్వర్ కల్పన ఎస్‌ఎంసీ సభ్యులకు సూచించారు. గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీవోస్ కాలనీలోని ఎంఈవో కార్యాలయంలో గురువారం సీతమ్మధార మండలంలోని జీవీఎంసీ పాఠశాలల ఎస్‌ఎంసీ సభ్యులకు మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో మిగతా సభ్యులకు వివరించాలన్నారు. పాఠశాలల్లో ఎటువంటి తప్పు జరిగినా, గాడి తప్పుతున్న విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించేందుకు ఎస్‌ఎంసీ సభ్యులు కృషి చేయాలన్నారు. ఎల్లప్పుడూ పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కోసం పని చేయాలన్నారు.

ఈ శిక్షణా తరగతుల్లో సీఆర్పీలు కె.సత్యానారాయణ, వెంకటేష్, సురేష్ ఎస్‌ఎంసీ సభ్యులకు క్లుప్తంగా అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, బాలామణి, సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌కు భావన, భాను, తెరీషా



విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌కు నగరానికి చెందిన అయేషా భాను, పి.భావన, పి.తెరీషా ఎంపికయ్యారు. రాంచీలో జరిగే ఈ టోర్నీలో షాట్‌పుట్, హేమర్ త్రో ఈవెంట్లలో అయేషా భాను...100.మీ, 200మీ. పరుగులో తెరీషా, రేస్ వాక్ ఈవెంట్‌లో భావన ప్రాతినిధ్యం వహించనున్నారు. రైల్వే అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో సీనియర్ కోచ్ పిట్టా శ్రీనివాసరావు వద్ద శిక్షణ పొందుతున్న అథ్లెట్లు జాతీయ టోర్నీకి ఎంపిక కావడంపై వాల్తేరు రైల్వే జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, సీనియర్ అథ్లెట్ రాజేష్ కృష్ణంరాజు తదితరులు హర్షం వ్యక్తం చేసి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

» ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, జనవరి 2,(ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. చక్కని క్రీడాకారులుగా రాణించి దేశానికి మంచి పేరుతీసుకురావాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులు అంటే కేవలం చదువులే కాదని ఆటలు, టెక్‌ఫెస్ట్‌లు తదితర వాటిల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేవీ రమణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మద్యం ప్రీమియం స్టోర్‌లకు రీ నోటిఫికేషన్

» లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.కోటి

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు మద్యం ప్రీమియం స్టోర్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ రీ నోటిఫికేషన్ జారీచేశారు. దరఖాస్తుదారులు రూ.15 లక్షలు (నాన్ రిఫండ్) డీడీ తీసి అందజేయాల్సి ఉంటుంది. లాటరీలో స్టోర్ దక్కిన వారికి ఐదేళ్ల వ్యవధికి లైసెన్స్ జారీచేస్తారు. ప్రీమియం స్టోర్‌కు లైసెన్స్ ఫీజు కింద మొదటి ఏడాది రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది నుంచి పది శాతం చొప్పున లైసెన్స్ ఫీజు పెరుగుతుంది. స్టోర్ ఏర్పాటుచేయడానికి కనీసం నాలుగు వేల చదరపు అడుగులు వైశాల్యం కలిగిన భవనం ఉండాలి. ప్రీమియం స్టోర్‌లో మద్యం బ్రాండ్‌లను కొనుగోలుదారులకు తెలిసే ఆకర్షణీయమైన ర్యాక్‌లు, ఇంటీరియర్‌తో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. రెండు ప్రీమియం దుకాణాలకు గత నెల 17న నోటిఫికేషన్ జారీచేసినప్పటికీ ఎవరూ దరఖాస్తు చేయకపోవడంతో రీ నోటిఫికేషన్ జారీచేశారు. స్టోర్ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగానీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నేరుగా గానీ ఏడో తేదీలోగా అంద సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు.

సిగ్నల్ జంక్షన్ వద్ద మొరాయించిన లారీ

» ఆర్ అండ్ బీ సమీపంలో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం

మాధవధార, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోకి గేట్ వే లా ఉండే రోడ్డు మార్గం ఎన్ఏడీ కొత్తరోడ్డు. ఆ తరువాత నగరంలోకి ప్రవేశించే ప్రధాన జంక్షన్ అర్ అండ్ బీ జంక్షన్ ఉంది. నిత్యం ఈ ఆర్ అండ్ బీ హైవే రోడ్డు సిగ్నల్ జంక్షన్ దాటి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సరిగ్గా ఈ జంక్షన్‌లోనే గురువారం సరుకుతో ఉన్న లోడు లారీ దారి మధ్యలో అర్ధంతరంగా ఆగిపోయింది. ఉదయం 8 గంటల సమయంలో లారీ ఆగిపోవడంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లోనే లారీ ఆగిపోయింది. ఇటు ఎన్ఏడీ వైపు వెళ్లే వాహనాలు, అటు ఊర్వశి జంక్షన్ మీదుగా గురుద్వార్ వైపు వెళ్లే ప్రయాణికులు, మరో వైపు మాధవధార నుంచి సీతమ్మధార వైపు రోడ్డు, అటు మర్రిపాలెం ఉడా లే అవుట్‌కు వెళ్లే వారంతా ఉదయం ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు.

నేడు తోటగరువు పాఠశాలలో జిల్లా సైన్స్ ఫెయిర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి జరగనున్న సైన్స్ ఫెయిర్‌లో విశాఖ జిల్లాలోని 11 మండలాల నుంచి మండలానికి మూడేసి చొప్పున మొత్తం 33 ఉత్తమ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురు వారం తోటగరువు హైస్కూలులో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వాహక కమిటీలో ఆయన సమా వేశమై ఏర్పాట్ల గురించి సమీక్షించారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ జిల్లా సైన్స్ ఫెయిర్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. విద్యార్థి వ్యక్తిగత, బృందాలు, ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగాల వారీగా ప్రాజెక్టులు ఎంపిక చేసినట్టు చెప్పారు. వీరికి విభాగాల వారీగా ప్రదర్శనలకు అవసరమైన గదులను కేటాయించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా భోజన, వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సైన్స్ ఫెయిర్ ప్రారంభం అవుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సర్వశిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో వ్యవహరించి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏడీ-1 అరుణజ్యోతి, డీసీబీ బోర్డు కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, హెచ్ఎం మురళి, జిల్లా సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్, తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం గరిమెళ్ల దుర్గాభవానీ పాల్గొన్నారు.

ప్రధాని రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

ప్రధాని దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకూ ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకునే బాధ్యతను ఈ కమిటీలకు అప్పగించారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఆర్డీవోలు, పోలీస్ అధికారులను ఈ కమిటీల్లో నియమించారు. విశాఖ పోర్టుతోపాటు మరికొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు మరికొన్ని బాధ్యతలు అప్పగించారు.

సబ్బవరం-షీలానగర్ హైవేకు నిధులు

... 5వ పేజీ తరువాయి

సబ్బవరం వద్ద ఏర్పాటుచేసే ఇంటర్ చేంజ్ వద్ద డైవర్షన్ తీసుకొని షీలానగర్ మార్గంలోకి వచ్చేస్తాయి. అక్కడి నుంచి విమానాశ్రయం పక్కనున్న మార్గంలో పోర్టుకు వెళతాయి. దీంతో నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి(16)పై భారీ వాహనాల రాకపోకలు తగ్గుతాయి. దీనివల్ల ప్రమాదాల సంఖ్య కూడా తగ్గనుంది.

పిల్లలు లేరని మనోవ్యథతో యువ దంపతుల ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

బంధువులను విచారించారు. పెళ్లై ఆరేళ్లవుతున్నా సంతానం కలగలేదని తరచూ మథనపడుతుండేవారని పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవడం, బంధువులు దూరం పెట్టడం వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. వారిద్దరి సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సీఐ కేవీఎస్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరి తాత కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మిలీనియం టవర్స్‌లో టీసీఎస్

... 5వ పేజీ తరువాయి

టవర్-ఏలో ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఐకానిక్ టవర్లు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలో ఉన్నాయి. వీటిని డీనోటిఫై చేశాక టీసీఎస్‌కు అప్పగించనున్నారు. దీనికి ముందు నాన్ సెజ్ ఏరియాలో డల్లాస్ టెక్నాలజీస్ నిర్మించిన భవనాన్ని తీసుకోవడానికి టీసీఎస్ ముందుకు వచ్చింది. లీజు ఒప్పందం కూడా జరిగింది. అయితే టీసీఎస్ కోరిక మేరకు మిలీనియం టవర్లను కేటాయించారు. వీటిలో షిఫ్ట్‌నకు రెండు వేల మంది పనిచేసుకునే వెసులుబాటు ఉంది. ఆ సంస్థ మొత్తం దశల వారీగా పది వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించింది.

ఇదిలావుండగా ఈ నెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం వచ్చే ప్రధాని నరేంద్రమోదీ విశాఖ కేంద్రంగా మంజూరైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని సీఎం చంద్రబాబునాయుడు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. ముడసర్లోవలో జీవీఎంసీ కేటాయించిన భూముల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం జరగనుంది. దీనికి ఇప్పటికే రూ.150 కోట్లు నిధులు కేంద్ర బడ్జెట్‌లో మంజూరుచేశారు.

ప్రతిభకు పట్టం

... 5వ పేజీ తరువాయి

అంతర్జాతీయస్థాయిలో తిరుగులేని స్ప్రింటర్‌గా పతకాలు సొంతం చేసుకున్నది. గత ఏడాది చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో 100 మీ. హర్డిల్స్‌లో రజత పతకం సాధించింది. ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో 100 మీటర్ల హర్డిల్స్‌లో కేవలం 13.09 సెకన్లలో లక్ష్యం చేరుకుని స్వర్ణ పతకం గెలుచుకుంది. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకం దక్కించుకుంది.

ఆమె పేరునే జాతీయ రికార్డు

జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్స్‌లో ఇప్పటివరకు 37 పతకాలు సాధించిన జ్యోతి ఎర్రాజీ గత ఏడాది గుజరాత్‌లో జరిగిన 36వ నేషనల్ గేమ్స్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.79 సెకన్లతో స్వర్ణ పతకం సాధించి కొత్త రికార్డును నెలకొల్పింది. ఆ రికార్డు ఇప్పటికీ ఆమె పేరున ఉంది.

అంతర్జాతీయ మెరుపులు

ఏషియన్ గేమ్స్ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్యం, సైప్రస్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, లౌబోరోగ్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, నెదర్లాండ్‌లో జరిగిన హ్యారీ స్కల్టింగ్ గేమ్స్, అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, ఐఎఫ్ఏఎం ఇంటర్నేషనల్ ఫ్లాండర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో రజతం, నెదర్లాండ్స్‌లో జరిగిన ఎలైట్ ఇండోర్ ట్రాక్ అథ్లెటిక్స్ మీట్‌లో రజతం, కజకిస్తాన్‌లో జరిగిన పదో ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 60 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాలు సాధించింది.

రాష్ట్రానికి గర్వకారణం

ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు ఎర్రాజీ జ్యోతికి ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆమె ప్రతిభకు జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పట్టం కట్టాయి. అత్యున్నత టోర్నీలలో పతకాలు అందించిన జ్యోతి.. 40 ఏళ్ల తర్వాత విశాఖ నుంచి ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఆమెకు అర్జున అవార్డు ప్రకటించడం రాష్ట్ర క్రీడారంగానికి గర్వకారణం.

– గణబాబు, ప్రభుత్వ విప్

ఎంపీ అభినందనలు

అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతిని ఎంపీ శ్రీభరత్ అభినందించారు. ఎంపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శ్రీభరత్ మాట్లాడుతూ జ్యోతి క్రీడా ప్రస్థానం, విజయాలు విశాఖ నగరానికి గర్వకారణమే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతోమంది యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలిచాయన్నారు. ఈ వార్డు ఆమె క్రీడా ప్రయాణంలో ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.


ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

అల్లిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) :అల్లిపురంలోని బల్లిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10న జరగనున్న ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈఓ జీవీ రమాబాయి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోజు తెల్లవారుజామున 1 గంట నుంచి స్వామివారికి ఆరాధన, పల్లకీ సేవ నిర్వహించి 3 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని చెప్పారు. అనంతరం అలయ మండపంలో ఉత్సవమూర్తులకు సహస్రనామార్చన నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 13న గోదాదేవి కల్యాణం, 15న తిరువీధి, 16న పరస మహోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.









భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం 39వ వార్డు ఎంవీడీఎం పాఠశాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే సదస్సుల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వార్డు ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2.16 లక్షల చెక్కును ఆయన చింతకాయల వెంకటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాధిక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటేష్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

రెవెన్యూ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, అసోసియేషన్ అధ్యక్షుడు యోగి, కార్యదర్శి రమేశ్, రవి శంకర్, నవీన్ రాజు, రవికృష్ణ , విజయకుమారి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

డాబా గార్డెన్స్‌లో సంగీత విభావరి రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజు, తదితరులు

డాబాగార్డెన్స్,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబేవి కళలు అని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం ఆయన డాబాగార్డెన్స్‌లో సంగీత విభావరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి యువత సంగీతంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మాజీ ఏడీసీపీ మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గీత్ సంగీత్ సినీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయకులు ఎస్ఎస్ఎన్ రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో పగల్‌పత్ సేవ



తిరువీధిలో ఊరేగుతున్న స్వామివారు

సింహాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి పగల్‌పత్ సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు పూర్తిచేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సర్వాభరణాలతో శోభాయమానంగా అలంకరించి బంగారు తొళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. షోడశోపచరాలు సమర్పించిన తరువాత ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బేడామండప తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. మార్గంలో దిక్పాలకులకు పూజలు చేశారు. భక్తుల హరినామస్మరణతో ఆలయం మార్మోగింది. తరువాత ఆస్థానమండపంలో ప్రత్యేక వేదికపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేసి స్థానాచార్యులు రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు.

జ్యోతికి కలెక్టర్ అభినందనలు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అర్జున అవార్డుకు ఎంపికైన అంతర్జాతీయ అథ్లెట్, ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అత్యున్నత క్రీడాకారులకు అందించే అర్జున అవార్డు పురస్కారం జ్యోతికి ప్రకటించడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాదికారి గ్యాలియట్, కోచ్‌లు కూడా జ్యోతికి అభినందనలు తెలిపారు.

ఏబీ బర్ధన్‌కు నివాళి

అల్లిపురం,జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నీతి, నిజాయతీకి నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ ఏబీ బర్ధన్ అని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కొనియాడారు. గురువారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బర్ధన్ 9వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బర్ధన్ 16 ఏళ్ల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అనేక ఉద్యమాలు నడిపారన్నారు. ఉద్యమ ఐక్యత కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, అచ్యుతరావు, సత్యనారాయణ, ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలి'

మహారాణిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని నార్కోటిక్ ట్రైనింగ్ సెంటర్ అడిషనల్ డైరెక్టర్ ఈ. రవికిరణ్ అన్నారు. గురువారం మహారాణిపేటలోని నెహ్రూ యువజన కేంద్రంలో అంతర్ జిల్లాల యువ సమ్మేళనం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతితో కలిసి జీవించినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. నెహ్రూ యువజన కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఎన్‌వైకే దేశవ్యాప్తంగా పలు సమ్మేళనాలు నిర్వహిస్తుందని, ఇవి యువతకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన విదేశీ విద్యార్థులు


వీసీని కలిసి శుభాకాంక్షలు చెబుతున్న విదేశీ విద్యార్థులు

వెంకోజీపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈ.ఎస్ ధనుంజయరావులకు విదేశీ విద్యార్థులు బుధవారం వీసీ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో తమకు మెరుగైన వసతులు కల్పిస్తున్నారని, ఏయూలో చదువుకోవడం తమకెంతో గర్వకారణంగా ఉందని విదేశీ విద్యార్థులు తెలిపారు.

కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్

» ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

మద్దిలపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడు నెలల కూటమి ప్రభుత్వ పాలన అట్టర్‌ప్లాప్ అయిందని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. మద్దిలపాలంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత గాలిలో దీపంలా మారిందన్నారు. జగన్ పాలనలో విద్యాంధ్రప్రదేశ్‌గా ఉంటే కూటమి పాలనలో మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని ఎద్దేవా చేశారు. 77 రోజుల్లో రూ.66 వేల కోట్లు మద్యం విక్రయాలు జరిగాయని, గత ప్రభుత్వంలో కంటే 18 శాతం మద్యం, 40 శాతం బీర్లు అమ్మకాలు పెరగడం దేనికి సంకేతమన్నారు. వైసీపీ ప్రజల పక్షాన నిలిచి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వారకు పోరాటం చేస్తుందన్నారు.

సీపీ ఆదేశాలతో కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మధురవాడకు చెందిన ముళ్లపూడి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా పొందూరులో స్థల వివాదానికి సంబంధించి, ఎచ్చెర్లకు చెందిన వారు ఎంవీపీ స్టేషన్ పరిధిలో తనపై దాడికి పాల్పడితే, సివిల్ వ్యవహారమని సీఐ తనపై ఆగ్రహం వ్యక్తం చేశారని కోటేశ్వరరావు సీపీకి ఫిర్యాదు చేశారు.

నేపథ్యంలో సీపీ ఆదేశించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ పోలీసులు తనను పిలిచి ఎఫ్ఐఆర్ కాపీని అందించారని కోటీశ్వరరావు తెలిపారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 44, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36 దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాబేజి 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


తవ్వి వదిలేయడంతో అధ్వానంగా మారిన రహదారి


రాళ్లు తేలి గోతులమయంగా తయారైన పెదజాలరిపేట ప్రధాన రహదారి

నాణ్యత శూన్యం.. దారులు దయనీయం

» అధ్వానంగా పెదజాలరిపేట రోడ్లు » ఏడాది కిందట రూ.కోటి ఖర్చుతో ఏర్పాటు » ప్రమాణాలు పాటించకుండా పనులు

పెదవాల్తేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇక్కడి ప్రధాన రహదారిని గత ఏడాది జనవరిలో సుమారు రూ.కోటి వెచ్చించి జీవీఎంసీ నిర్మించింది. అయితే ఈ రోడ్డు నిర్మాణ విషయంలో హడావుడిగా పనులు చేయడం తప్ప నాణ్యతపై దృష్టి సారించలేదు. ఎలాంటి ప్రమాణాలు పాటించలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా.. స్థానిక అవసరాలకు అనుగుణంగా కాకుండా ప్లాన్ లేకుండా రోడ్డు వేశారన్న స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెదజాలారిపేట చేపల మార్కెట్, ప్రజా ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డు నిర్మాణం మరిచారు. పలు చోట్ల కేబుల్ వైర్లు వేసేందుకు తవ్వేయడం, సరిగా పూడ్చకపోవడంతో రహదారులు పరమ అధ్వానంగా తయారయ్యాయి. చాన్నాళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఈ రోడ్లు శిథిలావస్థకు చేరాయి. ఈ మార్గంలో ప్రతి రోజు వేలాది మంది పాదచారలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఈ మార్గంలో ప్రజా ఆరోగ్య కేంద్రం, దేవాలయాలు, చేపల మార్కెట్లు ఉన్నాయి.

కానీ ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ ప్రాంతంలో రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పదో వార్డులో రూ.2.7 కోట్లతో అభివృద్ధి


పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ రామలక్ష్మిరాజశేఖర్ తదితరులు

ఆరిలోవ. జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సుమారు రూ.2.7 జీవీఎంసీ నిధులతో పదో వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. స్థానిక సుందరనగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపనలు చేశారు. కార్పొరేటర్ మద్దిలి రామలక్ష్మి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రూ.32 లక్షలతో పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఇక్కడ సేదతీరేందుకు అవకాశమే లేదని స్థానికులు తన దృష్టికి తేవడంతో తక్షణమే పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా చిన్నారులు ఆడేందుకు, వృద్ధులు సేద తీరేందుకు, అన్ని వర్గాల వారి అవసరాలను తీర్చే విధంగా ప్రత్యేక సదుపాయాలను పార్కులో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు రాజేశ్, రమణి, ధనలక్ష్మి, జనసేనకు చెందిన రాజారమేష్, బీజేపీ నేతలు దొంతల రమణ, ఏఈ వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ సీపీ'కి మూడు ఫిర్యాదులు


దివ్యాంగుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నిర్వహించిన దివ్యాంగ్ సురక్ష 'డయల్ యువర్ సీపీ' కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషరేట్‌లోని తన ఛాంబర్ నుంచి గురువారం ఆయన ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ముగ్గురు దివ్యాంగులు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో వారి సమస్యలను విని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అపుస్మా జోన్-1 అధ్యక్షుడిగా ఎంవీ రావు


ఎంవీ రావును అభినందిస్తున్న సంఘం నేతలు

ఆరిలోవ జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపుస్మా) జోన్-1 అధ్యక్షుడుగా మల్లపురెడ్డి వెంకటరావు (ఎంవీ రావు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన అపుస్మా రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో విశాఖపట్నం ఆరిలోవలో భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ వెంకటరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు జోన్-1 పరిధిలోకి వస్తాయని ఎంవీ రావు తెలిపారు.

వృత్తి కార్మికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

» యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి

వెంకోజీపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు అవసరమయ్యే వివిధ వృత్తిపరమైన సేవలను అందించేందుకు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను నిర్వహిస్తున్నట్టు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఈ నెల 5వ తేదీలోగా ఉత్సాహవంతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని గల స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబాలకు చెందిన వారు కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ టెక్నీషియన్స్, బ్యూటీషియన్ (మెన్ అండ్ ఉమెన్) వంటి సేవల్లో నైపుణ్యం పెంపొందించనున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన వారి సేవలు, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, తద్వారా ఉపాధి అవకాశాలు లభించేలా చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి హోం ట్రయాంగిల్ సంస్థతో మెప్మా ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. జీవీఎంసీలోని ఆసక్తి కలిగిన సర్వీస్ ప్రొవైడర్లను హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా నమోదు చేసి వారికి అవసరమైన శిక్షణలను ఇవ్వడానికి, వారు బిగ్ ఎకానమీలో భాగమైన ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు సర్వీస్ ప్రొవైడర్ల గుర్తింపు మేళాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గత అభ్యర్థులు ఎస్‌హెచ్‌జీ ఆర్పీల ద్వారా లేదా ఆయా జోనల్ కార్యాలయాలలో గల యూసీడీ విభాగంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఎంఆర్డీఏ చైర్మన్


కలెక్టర్ హరింధర్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ గురువారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి నోట్ బుక్స్ అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

నేటి నుంచి మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో మెరిట్ టెస్టులకు హాజరుకావాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. కాగా గురువారం పురుష అభ్యర్థులకు జరిగిన మెరిట్ టెస్టులకు 600 మందికి గానూ 228 మంది హాజరయ్యారు. చెస్ట్, బరువు, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు ఈవెంట్లు నిర్వహించారు. తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, మైదానంలోకి అనుమతించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ బి. అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, టి.కల్యాణి పాల్గొన్నారు.

నేడు తోటగరువు పాఠశాలలో జిల్లా సైన్స్ ఫెయిర్

» ఏర్పాట్లపై నిర్వాహక కమిటీతో డీఈవో ప్రేమ్‌కుమార్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్, వేదికపై ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖర్ తదితరులు

ఆరిలోవ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి జరగనున్న సైన్స్ ఫెయిర్‌లో విశాఖ జిల్లాలోని 11 మండలాల నుంచి మండలానికి మూడేసి చొప్పున మొత్తం 33 ఉత్తమ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురు వారం తోటగరువు హైస్కూలులో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వాహక కమిటీలో ఆయన సమా వేశమై ఏర్పాట్ల గురించి సమీక్షించారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ జిల్లా సైన్స్ ఫెయిర్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. విద్యార్థి వ్యక్తిగత, బృందాలు, ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగాల వారీగా ప్రాజెక్టులు ఎంపిక చేసినట్టు చెప్పారు. వీరికి విభాగాల వారీగా ప్రదర్శనలకు అవసరమైన గదులను కేటాయించాలని సూచించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా భోజన, వతి ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సైన్స్ ఫెయిర్ ప్రారంభం అవుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సర్వశిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో వ్యవహరించి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏడీ-1 అరుణజ్యోతి, డీసీబీ బోర్డు కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, హెచ్ఎం మురళి, జిల్లా సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్, తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం గరిమెళ్ల దుర్గాభవానీ పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

» 42 అంశాలతో » ఎజెండా అస్మదీయులైన కాంట్రాక్టర్లకు చెత్త వాహనాల నిర్వహణ అప్పగింత

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం జరుగుతుందని కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం కోసం 42 అంశాలతో ఎజెండా తయారుచేశారు. 2024 సెప్టెంబరులో నగరంలోని 30 పాఠశాలల్లో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ ఇచ్చినందుకు ఓ ఎన్‌జీవోకు రూ.1.5 లక్షలు చెల్లింపు, పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల వాడకంపై అవగాహన కల్పిం చేందుకు గ్రీన్ ఎన్విరో అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్లానింగ్ కన్సల్టెంట్‌కు రూ.80 వేలు, దీనిపై వెయ్యి పుస్తకాలను ముద్రించి కార్మికులకు అందజేసేందుకు రూ.మూడు లక్షలు చెల్లింపునకు అనుమతి అంశాలను ఎజెండాలో చేర్చారు. అలాగే వార్డుల్లో చెత్త తరలించేందుకు జీవీఎంసీకి చెందిన 6 సీఎంటీ సామర్థ్యం కలిగిన వాహనాలను నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే అంశాలను ఎజెండాలో చేర్చారు.

అయితే ఒకే వార్డులో పనిచేసిన వాహనాలకు నిర్వహణ ఖర్చులను ఒకే బిల్లుగా కాకుండా పది రోజులు చొప్పున విడదీసి చెల్లించాలని ప్రతిపాదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.రూ.ఐదు లక్షలు దాటితే టెండరు పిలవాల్సి ఉంటుంది కాబట్టి, రూ.ఐదు లక్షలలోపు బిల్లు వచ్చేలా పది రోజులు చొప్పున విడదీసి అస్మదీయులైన వారికి నామినేషన్‌పై అధికారులు కాంట్రాక్టులు ఇచ్చేశారని ప్రచారం జరుగుతోంది.

అలాగే పలుజోన్లలో దుకాణాలు వేలం, రాత్రి శానిటేషన్ విధులు నిర్వర్తించే కార్మికులకు వేతనాలు చెల్లింపు, లాంగ్‌లీవ్‌లో ఉన్న అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల స్థానంలో తాత్కాలిక కార్మికుల నియామకం వంటి అంశాలను ఎజెండాలో చేర్చారు.

ఏపీఎల్ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నిర్వాహకులు యాసిన్, జగదీష్ తదితరులు

ఆరిలోవ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఆరిలోవ క్రీడామైదానంలో ఆరిలోవ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలను నిర్వహించడం వల్ల ఐక్యత, పోరాట పటిమ వంటి లక్షణాలు యువతలో పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు. ఉత్సాహం నింపే ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ టోర్నీ నాలుగు రోజుల పాటు జరుగుతాయని, 8 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు నిర్వాహకులు యాసిన్, జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

అలరించిన ప్రజా నాట్య మండలి ప్రదర్శనలు

సఫ్దర్ హాష్మీకి ఘన నివాళి


గేయాలను ఆలపిస్తున్న ప్రజా నాట్య మండలి కళాకారులు

సిరిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కష్టజీవుల హక్కుల సాధన కోసం సఫ్దర్ హష్మీ అనేక వీధి నాటికలు కళారూపాలు తయారు చేసి ప్రజల మధ్య నిత్యం ప్రదర్శించి ప్రజా చైతన్యానికి ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రజా నాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సఫ్ధర్ హష్మీ 36వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా హష్మీ అనేక వీధి నాటికలు వేసి చైతన్యం రేకెత్తించేవారన్నారు.

అనంతరం అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ నాటికలు ప్రదర్శించారు. ఆహార భద్రత అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ప్రజా నాట్యమండలి గాయకులు ఆలపించిన గేయాలు అలరించాయి. కార్యక్రమానికి సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, ప్రజా నాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు దండు నాగేశ్వరరావు, జి.స్టాలిన్, ఏ. మౌలాలి, రమణ, డేవిడ్ రాజు, శివజ్యోతి, పుష్యమి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయం వద్ద అన్నసమారాధన

ఆరిలోవ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ఎస్కేఎల్ఎం నగర్‌లో వెలిసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యానారాయణ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

5న జగదల్‌పూర్ వరకే కిరండోల్ రైలు


విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని కిరండోల్, కోరాపుట్ సెక్షన్ మధ్య సబ్ వే నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 5న విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ (18514) రైలు విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18513) ఈ నెల 6న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే విశాఖ-కిరండోల్ పాసింజర్ రైలు (58501) ఈ నెల 6న విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ పాసింజర్ రైలు (58502) ఈనెల 7న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతుందని పేర్కొన్నారు. జగదల్‌పూర్, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

అబ్బురపరిచిన నేవీ విన్యాసాలు


తీరంలో యుద్ధ ట్యాంకర్ల ప్రదర్శన

- ఆద్యంతం ఆకట్టుకున్న లేజర్ షో
- భారీగా తరలివచ్చిన సందర్శకులు

సాగర తీరంలో తూర్పు నౌకాదళం పూర్తి స్థాయి సాహస విన్యాసాల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ నెల 4న జరిగే విన్యాసాలకు పూర్తిస్థాయిలో సన్నద్ధ మయ్యేందుకు గురువారం సాయంత్రం అన్ని రకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఎయిర్‌జెట్లు, హెలికాప్టర్లు, కమాండోల ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా చీకటి పడిన తరువాత ఏర్పాటు చేసిన లేజర్ షో, డ్రోన్ల ప్రదర్శన సందర్శకులను కట్టి పడేసింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ఆకట్టుకున్న లేజర్ షో


డ్రోన్లతో నౌకా ప్రదర్శన


నేవీ సిబ్బంది కవాతు


ఆపదలో ఉన్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్లు


సబ్‌మెరైన్ నుంచి బాంబులతో దాడి చేస్తున్న దృశ్యం


విన్యాసాలను తిలకిస్తున్న సందర్శకులు


డ్రోన్లతో భారతదేశం నమూనా

డ్రోన్ల ప్రదర్శన అదుర్స్

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చునో తూర్పు నౌకాదళం అధికారులు చాటి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రోన్ల వినియోగం పెంచాలని చెబుతున్న నేపథ్యంలో వాటిని ఉపయోగించి అబ్బుర పరిచే విన్యాసాలు ప్రదర్శించారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించిన సాహస విన్యాసాల రిహార్సల్ అనంతరం డ్రోన్లతో ఆకాశంలో అద్భుతాలు ఆవిష్కరించారు. నల్ల కాగితంపై తెల్ల చుక్కలతో బొమ్మలు గీసినట్టు...చీకటి పడ్డాక ఆకాశంలో మిణుకుమిణుకుమంటూ వెలిగే డ్రోన్లతో వివిధ రూపాలను ఆవిష్కరించి శెభాష్ అనిపించారు. ఒక్కో చిత్రానికి 20 నుంచి 30 డ్రోన్లు వినియోగించారు. వాటిని కంప్యూటర్‌తో అనుసంధానం చేసి ఒక బొమ్మలో అమరేలా, అక్కడే నిశ్చలంగా ఉండేలా చేశారు. ఈ క్రమంలో కొన్ని డ్రోన్లకు బ్యాటరీ డిశ్చార్జి జరిగి కిందకు పడిపోయాయి. అదే విధంగా లేజర్ షో బీచ్‌లో ఆ చివరి నుంచి ఈ చివరి వరకు అందరి చూపులను కట్టిపడేసింది. మెరైన్ కమెండోల సాహస ప్రదర్శనలు, ఆయిల్ రిగ్ పేల్చివేత వంటికి అలరించాయి.


శత్రు మూకలపై కమెండోల దాడి


పారాచ్యూట్ నుంచి దిగుతున్న కమెండోలు




యుద్ధ విమానాలతో విన్యాసాలు

ఘనంగా ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- సందడి చేసిన కథానాయకి మీనాక్షి చౌదరి

జగదాంబ కూడలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ గురువారం ప్రారంభమయింది. లేపాక్షి ప్రాంతంలో సుందరంగా తీర్చిదిద్దిన షోరూమ్‌ను సినీ నటి మీనాక్షి చౌదరి ప్రారంభించారు. కాగా మూడు ఫ్లోర్లతో అన్నిరకాల వస్త్రాలు అందుబాటులో ఉండేలా సంక్రాంతి పండగకు ముందు షోరూమ్ ప్రారంభించడం ఆనందంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజమౌళి అన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్స్ అందిస్తున్నామన్నారు. ఇప్పటికే


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో ఆర్‌ఎస్ బ్రదర్స్ ఎండీ రాజమౌళి తదితరులు


చీరతో సినీ నటి మీనాక్షి చౌదరి

నగరంలో ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ ఉండగా, తాజాగా అన్ని హంగులతో ప్రారంభించారు. అనంతరం సినీ నటి మీనాక్షి చౌదరి సరికొత్త డిజైన్లలో ప్రత్యేకంగా రూపొందించిన లేడీస్ కౌంటర్‌ను సందర్శించారు, వర్క్‌శారీస్, డిజైనర్ శారీస్ ప్రదర్శించారు. సాగరతీరంలో ఆర్‌ఎస్ బ్రదర్స్ అతిపెద్ద షోరూమ్ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని, సరికొత్త డిజైన్లతో యువతరం, మహిళలకు మెచ్చే వస్త్రాలను యాజమాన్యం అందుబాటులో ఉంచిందన్నారు. మగువల మది దోచే రీతిలో గ్రామ్ గోల్డ్ ఆభరణాలు లభిస్తాయన్నారు. అంతకు ముందు దక్షిణ ఎమ్మెల్యే వంశీకష్ణ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఆర్‌ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, టి.ప్రసాదరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. కాగా నటి మీనాక్షి చౌదరిని చూసేందుకు అభిమానులు వెల్లువలా తరలివచ్చారు. వారితో సెల్ఫీ తీసుకుని ఆమె సందడి చేశారు. వన్ టౌన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులందరికీ అప్పన్న ఉత్తర ద్వార దర్శనం: ఈవో


సమావేశంలో ఈఓ, అధికారులు

సింహాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల పదో తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులందరికీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం లభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవ విజయవంతానికి పోలీసు, జీవీఎంసీ తదితర అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భక్తులంతా క్యూలో ఉండగానే స్వామిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక స్ర్కీన్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏఈఓలు ఎన్.ఆనందకుమర్, రాంబాబు, శ్రీనివాస్, పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు.

5న హాకీ జిల్లా జట్టు ఎంపికలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్టు ఎంపిక పోటీలు ఈనెల 5న సాలిగ్రామపురంలోని పోర్టు గ్రౌండ్‌లో నిర్వహించనున్నామని హాకీ విశాఖ సంఘం కార్యదర్శి అంజనేయరావు తెలిపారు. జనవరి ఒకటి 2009 లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని, ఎంపికైన బాలుర జట్టు ఈనెల 17 నుంచి మదనపల్లి, బాలికల జట్టు ఈనెల 27 నుంచి అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 5న మధ్యాహ్నం 3 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9885199535 నంబరులో సంప్రతించాలన్నారు.

235 కిలోల గంజాయి స్వాధీనం


పెందుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ వుడాకాలనీ శివారు ఓ ఇంట్లో గుట్టుగా ఉంచిన గంజాయిని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినముషిడివాడ వుడా కాలనీలోని ఓ ఇంట్లో జార్ఖండ్‌కు చెందిన బినయ్‌కుమార్ మిశ్రా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన యోగేంద్రచౌదరి, ఒడిశాకు చెందిన షేక్ జిలానీలు అద్దెకు ఉంటున్నారు. మన్యం నుంచి గంజాయి తెచ్చి భద్రపరుస్తున్నారు. నిల్వ చేసిన గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. సమాచారం అందడంతో సీఐ సతీశ్‌కుమార్ ఆకస్మిక దాడి చేసి 235 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

కొమ్మాదిలో వ్యక్తి ఆత్మహత్య


అరవింద్ (ఫైల్ ఫొటో)

ఎండాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు కొమ్మాది ఎస్‌ఎస్‌వీడీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 401లో నివసిస్తున్న గొల్లంగి అరవింద్ (43) ఓ ప్రైవేటు పాఠశాల అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్నాడు. అతడి భార్య భార్య స్రవంతి మరో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, 13 ఏళ్ల కుమారుడు అక్కడే చదువుతున్నాడు. కాగా అరవింద్ ఆరోగ్యం సహకరించక పోవడంతో కొంతకాలంగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఎప్పటిలానే భార్య, కుమారుడు గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి తలుపు తట్టినా తీయకపోవడంతో బద్దలు కొట్టి చూడగా ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బాలకృష్ణ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. కాగా మృతుడు గతంలో స్థానిక కార్పొరేటర్ వద్ద పనిచేశాడని స్థానికులు చెబుతున్నారు.

వ్యసనాలకు బానిసైన యువకుడు...


అప్పలరాజు (ఫైల్ ఫొటో)

మల్కాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాలారివీధికి చెందిన నాగల అప్పలరాజు (27) మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీనిపై గురువారం భార్య ప్రశ్నించడంతో అప్పలరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలోని ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకున్నాడు. వంటగదిలోకి వెళ్లేందుకు భార్య ప్రయత్నించగా తలుపులు తెరుచుకోలేదు. బలవంతంగా తెరిచి చూసేసరికి అప్పలరాజు ఉరి వేసుకుని ఉండడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎంవీపీ కాలనీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం మండలం పాత కొవ్వాడకి చెందిన సబ్బవరపు పృథ్వి(24) హనుమంతువాకలోని బి స్క్వేర్ విల్లాలో బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా, మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆకస్మికంగా బ్రేకు వేయడంతో పృథ్వీ తన వాహనంతో ముందున్న వాహనాన్ని ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. వెంటనే గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మురళీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

మల్కాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్కే బీచ్‌లో డిసెంబరు 30న గల్లంతైన బాలుడి మృతదేహం గురువారం యారాడ తీరంలో లభ్యమైంది. వజ్రకుట్టి నరేశ్ (15) స్నేహితులతో కలిసి ఆర్కే బీచ్‌కు వచ్చాడు. సముద్రస్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. కాగా గురువారం ఉదయం యారాడ ఒడ్డుకు మృతదేహం కొట్టుకువచ్చినట్టు మల్కాపురం పోలీసులకు సమాచారం అందింది. వారు విచారించగా, నరేశ్‌దిగా గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

నేడు వీఎంఆర్‌డీఏలో ఓపెన్ ఫోరం

సిరిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి శుక్రవారం వీఎంఆర్డీఏలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ భవన్ మూడో అంతస్తులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ వినతులను సమర్పించవచ్చన్నారు.